# ఒక వాస్తవం

అర్ధరాత్రి కావొస్తూంది.

నిద్ర పట్టక పడకమీదనే దొర్లుతున్నాడు కరుణాకర్. తన మిత్రుడు మహేంద్ర అన్న మాటలే అతడికి గుర్తుకొచ్చి, నిద్రలేకుండా చేస్తున్నాయి. "చూడు కరుణా! నీకు నలభై ఏళ్లొచ్చాయి. ఇప్పటికీ నువ్వు కష్ట పడుతూనే ఉన్నావ్. కష్టపడితేనే కుటుంబం పోషించుకో గలుగుతున్నావ్. ఇలా ఎంత కాలం? నీకేదయినా అనారోగ్యం కలిగితే కుటుంబం పరిస్థితి ఏమిటి? ఆలోచించరా!"

ప్రతి మనిషికి తన పరిస్థితి పట్ల కొంత అవగాహన ఉంటుంది. కానీ ఇతరులు విశ్లేషించి ఆ పరిస్థితిని ఎత్తి చూపినప్పుడు తప్పకుండా భయమో, బాధో కలిగి తీరుతుంది. మిత్రుడి మాటలతో కరుణాకర్‌కు ఇప్పుడు అలాంటి బాధనే కలిగింది. 'నిజమే! ప్రభుత్వోద్యోగిగా తనింతకాలం సంపాదించిందేమీ లేదు. జీతం తీసుకు రావటం, నెలసరి ఖర్చులు పెట్టుకోవటం.. అంతే! తన మిత్రులంతా బాగా సంపాదిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగంలో లంచాలు, మరో వైపు చిన్న చిన్న సైడ్ బిజినెస్‌లతో డబ్బు సంపాదించి, ఇల్లు కట్టుకోవడం, బ్యాంక్ బేలన్స్‌లు మెయిన్‌టైన్ చేయడం చేస్తున్నారు. మరి తనే ఎందుకిలా? తనకు సంపాదన మీద మోజు లేదా? పిల్లలకు మంచి ఆస్తిపాస్తులు ఇవ్వాలనే కోరిక లేదా?'

'లేదు..తనిక మారాలి' మనసులోనే అనుకున్నాడు కరుణాకర్. లంచాలు అడగలేకపోవచ్చు గానీ, ఏదో సైడ్ బిజినెస్ చూసుకుని రెండు చేతులా సంపాదించాలి. ఆ నిర్ణయానికి వచ్చాక అతడికి ప్రశాంతంగా నిద్రపట్టింది.



రాత్రి ఆలోచనల మధ్య ఆలస్యంగా నిద్రపోవడంతో, ఏడింటి వరకూ మెలకువే రాలేదు. భార్య రేణుక కంగారుగా తట్టి లేపడంతో మెలకువొచ్చింది. "ఏంటి రేణూ" కళ్లు నలుముకుంటూ అడిగాడు.

"ఏమండీ! మీరు.. మీరు త్వరగా మహేంద్రన్నయ్య ఇంటి వరకూ వెళ్లిరండి" ఆమె గొంతు అదోలా ఉంది.

అప్పుడే ఆమె ముఖంలోకి చూసిన అతడికి జరగ కూడనిదేదో జరిగిపోయిందన్న అనుమానం మొదటిసారి కలిగింది. అందువల్లే అతడు కాస్త భయంగానే అడిగాడు. "మ...మహేంద్ర ఇంటికా? ఇంత ఉదయాన్నే నేనా? ఎందుకు?"

ఆమె చెప్పలేక చెప్పింది. "అన్నయ్యకు రాత్రి గుండెపోటు వచ్చిందట. హాస్పిటల్‌కి తీసుకెళ్లే లోపు ప్రాణాలు పోయాయట"

కరుణాకర్‌కి తను వింటున్నది నిజమో, అబద్ధమో అర్థం కాలేదు.

డ్రెస్ మార్చుకుని వడివడిగా మహేంద్ర ఇంటి వైపు పరుగెత్తాడు.

అక్కడికి చేరుకునేసరికి వీధి వాకిటనే కనిపించింది మహేంద్ర శవం!

భార్యాబిడ్డలు రోదిస్తున్నారు. బంధుమిత్రుల కంట కన్నీరు కనిపిస్తుంది.

'పన్నెండు గంటల క్రితం తనతో కబుర్లు చెప్పి, తన భవిష్యత్ గురించి చర్చించి, ఆలోచించేలా చేసిన ఆ వ్యక్తి... ఇంతలోనే ఇలా...' కరుణాకర్‌కి దుఃఖం ముంచుకొచ్చింది.

శవయాత్ర ముగిసేవరకూ తను అక్కడే ఉన్నాడు.

సాయంత్రంగా మనసు నిండా బాధను నింపుకుని ఇంటికి చేరాడు.

మహేంద్ర మరణం బాగా క్రుంగదీయడంతో నాలుగు రోజుల పాటు ఆఫీసుకి వెళ్లలేకపోయాడు కరుణాకర్. ఐదో రోజు ఆఫీసుకు వెళ్లాడు.

ఆ మధ్యాహ్నం క్యాంటీన్‌లో కొలీగ్స్ మధ్య మహేంద్ర ప్రస్తావన వచ్చింది.

"తను చాలా జాగ్రత్తపరుడు. కష్టపడి సొంత ఇల్లు ఏర్పరచుకున్నాడు. ఎంతో కొంత సంపాదించి బిడ్డల పేరున బ్యాంకులో డిపాజిట్ చేశాడు. దురదృష్టవశాత్తు తను ముందే వెళ్లిపోయినా తన వాళ్లు రోడ్డున పడకుండా చేసి వెళ్లాడు" అన్నాడు రఘురామ్.

"కానీ మన మహేంద్ర డబ్బులు సంపాదించటం మీదనే శ్రద్ధ చూపాడు తప్ప పిల్లల్ని పెంచటం ఎలాగో తెలుసుకోలేదు. ఆయన సంపాదించిన ఆస్తి హారతి కర్పూరం కావడానికి ఆరు నెలలు కూడా పట్టదు" చెప్పాడు కౌశిక్.

"అదేంటి?" అడిగాడు కరుణాకర్.

కౌశిక్ చెప్పడానికి కాస్త ఇబ్బంది పడ్డట్టుగా ముఖం పెట్టాడు. కానీ చెప్పక తప్పదు కాబట్టి అన్నట్టుగా చెప్పాడు. "తండ్రి చనిపోయి నాలుగు రోజులు కూడా కాలేదు. మహేంద్ర కొడుకు నిన్న రాత్రి ఫ్రెండ్స్‌తో కలిసి బార్‌కి రావడం నేను చూశాను. నన్ను గుర్తు పట్టి తను తప్పించుకోవాలన్నట్టు అటునిటు తిరిగి అక్కడి నుండి వెళ్లిపోయాడు. మా వాడు కూడా తన క్లాస్‌మేటే కదా? తను చెప్పిన దాన్ని బట్టి మహేంద్ర కొడుకు జల్సారాయుడని, డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేస్తాడని, తనకు లేని దురలవాట్లు లేవని నాకు అర్థమయ్యింది. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తిపాస్తులు మాత్రమే సంపాదించి ఇవ్వాలనుకోవడం కాదు వాళ్లకు జీవితం గురించి చెప్పాలి. డబ్బు విలువ గుర్తించేలా చేయాలి"

ఆ తర్వాత కౌశిక్ ఏం చెపుతున్నాడో కరుణాకర్‌కి వినిపించలేదు. అతడి మనసు ఆ వాక్యాల చుట్టూనే తిరగసాగింది. 'తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తిపాస్తులు మాత్రమే సంపాదించి ఇవ్వాలనుకోవడం కాదు వాళ్లకు జీవితం గురించి చెప్పాలి. డబ్బు విలువ గుర్తించేలా చేయాలి'

'మరి ఈ విషయంలో మహేంద్ర తండ్రిగా తన కర్తవ్యం నిర్వర్తించాడా?'

'లేదు!'

'అలాంటి ఆ వ్యక్తి డబ్బు మాత్రమే సంపాదించమని తనకు సలహా ఇచ్చాడు. అతడి సలహా పాటిస్తే ఏమవుతుంది? డబ్బు విలువ తెలియని తన పిల్లలు ఆ ఆస్తిని హారతి కర్పూరం చేస్తారు. కాబట్టి తనేం చేయాలి?'

తనేం చేయాలో కరుణాకర్‌కి అర్థమయ్యింది.

ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికెళ్లగానే అతడు తన కొడుకు, కూతుర్లను దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. వారి చదువు ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నాడు. అవసరాలు ఏమైనా ఉన్నాయేమో కనుక్కున్నాడు. డబ్బును ఎలా ఖర్చు పెట్టాలో వివరించాడు.

ఆ రోజు అతడికి మునుపెన్నడూ కనిపించనంత సంతృప్తి తన పిల్లల ముఖాలలో కనిపించింది. 'ఆ సంతృప్తి వారి ముఖాలలో స్థిరపడితే చాలు, వారు జీవితకాలం ప్రశాంతంగా బ్రతికేయగలరు' మనసులోనే అనుకున్నాడు కరుణాకర్.

-సునీల్.జె (హైదరాబాద్)